క్లుప్తంగా

62 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న సుభాన్ ఖాన్

దొనకొండ: స్థానిక ఏబీఎం చర్చి పాస్టర్ డి.ప్రభుదాసు, సంఘస్తుల ఆధ్వర్యంలో గురువారం కంటి పరీక్షలు చేశారు. మార్కాపురానికి చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల సిబ్బంది 62 మందికి వైద్య పరీక్షలు చేశారు. 15 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వైద్యశాల టెక్నీషియన్ పఠాన్ సుభాన్ ఖాన్ వైద్య పరీక్షలు చేసి 15 మందిని మార్కాపురం ఆపరేషన్ కోసం తీసుకెళ్లారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సిబ్బంది ఎస్.నాగరాజు, సీహెచ్ ప్రేమసాగర్ పాల్గొన్నారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి



అర్జీలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, ఆర్డీఓ

దర్శి (కురిచేడు): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రత్యేకాధికారి జాన్సన్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని అర్జీలను ఆయన గురువారం కనిగిరి ఇన్‌చార్జి ఆర్డీఓ, వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. వెంకట శివరామిరెడ్డితో కలిసి పరిశీలించారు. అర్జీలను ఐదు విభాగాలుగా విభజించి పరిష్కరించాలన్నారు. అనంతరం రీసర్వే గ్రామమైన బుక్కాపురాన్ని పరిశీలించి రీసర్వే జరుగుతున్న తీరును సిబ్బందిని, గ్రామ రైతులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



రైతు రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: మండలంలోని రైతులంతా త్వరితగతిన రైతు రిజిస్ట్రేషన్ ఏపీఎఫ్ఆర్ పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి అన్నారు. మండలంలోని దేవరాజుగట్టు రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి రాయితీ, ఎరువుల రాయితీ, పంటల బీమా తదితర రకాల వ్యవసాయ అనుబంధ సేవలు పొందాలంటే తప్పనిసరిగా ఈ కార్డు తీసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు నంబర్, ఆధార్ నంబర్‌తో అనుసంధానమైన ఫోన్ నంబర్, భూమి పట్టాదారుని పాస్‌బుక్ జిరాక్స్ కాగితాలు తీసుకొని గ్రామ రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పోర్టల్లో వివరాలు నమోదు చేసిన తర్వాత భూమికి ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని చెప్పారు. ఏఈఓ సునీల్‌నాయక్, వీఏఏ చిన్నా, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

ముండ్లమూరు (దర్శి): వ్యాధులతో అప్రమత్తంగా ఉండి ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, ఎంపీపీ సుంకర సునీత సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై దృష్టిసారించి వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు ఎం.జాస్మిన్, జే.వెంకటేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంభం: అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు.. కంభం పట్టణంలోని తెలుగువీధికి చెందిన అప్పరబోయిన శ్రీనివాసులు(52) ఈ నెల ఒకటో తేదీన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో యర్రబాలెం సమీపంలో అడవి పంది దాడికి తెగబడటంతో గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు.

మొక్కజొన్నతో లాభాలు మిన్న

- 110 రోజుల్లో పంట చేతికి
- ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి
- సాగు చేసేందుకు రైతుల ఆసక్తి



పీవీపల్లిలో సాగు చేసిన మొక్కజొన్న

పుల్లలచెరువు:

వాణిజ్య పంటలైన పొగాకు, మొక్కజొన్న పంటలతో లాభాలు ఆర్జిస్తున్న రైతులు రబీ సీజన్‌లో కూడా మొక్కజొన్న పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన తర్వాత రబీ సీజన్‌లో విరామం ప్రకటించే వారు. ప్రస్తుతం సాగులో మెళకువలు, రైతు సేవా కేంద్రాలు అందుబాటులో ఉండటంతో రైతులు అధికంగా సాగు విస్తీర్ణం పెంచారు. ఈ ఏడాది పుల్లలచెరువు మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటతో పాటు తక్కువ పెట్టుబడి కావడంతో మొక్కజొన్న పంటపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

సాగు చేసే విధానం

మొక్కజొన్న పంటను రబీ సీజన్‌లో ఎక్కువగా సాగు చేస్తారు. పంట కాలం 110 రోజులు. విత్తనాల మధ్య వ్యత్యాసం 20 మీటర్ల పొడవు, 60 సెంటీ మీటర్ల వెడల్పు ఉండాలి. ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రభుత్వ మద్దతు ధర కేవలం క్వింటా ధర రూ.1850, మొక్కజొన్న కిలో విత్తనాలు ధర రూ.300, ఎకరాకు అయ్యే ఖర్చు రూ.2 వేలు, సస్యరక్షణ కోసం అయ్యే ఖర్చు రూ.2500, ఎకరాకు దుక్కికి అయ్యే ఖర్చు రూ.3 వేలు, విత్తనాలు చల్లేందుకు ఖర్చు రూ.2 వేలు, మార్పిడికి అయ్యే ఖర్చు రూ.3 వేలు, ఎకరా సాగులో మొత్తంగా అయ్యే ఖర్చు దాదాపు రూ.20 వేలు మాత్రమే.

కష్టానికి తగిన ఫలితం:



నేను ఈ సంవత్సరం ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. తక్కువ ఖర్చుతో కూడుకున్న మంచి లాభాలు వచ్చే పంట మొక్కజొన్న పంట. గత సంవత్సరంలో కూడా సాగు చేశా. మంచి లాభాలు వచ్చాయి. అందుకోసం ఈ సంవత్సరం కూడా సాగు చేస్తున్నా. ప్రకృతి సహకరిస్తే ఎకరానికి 30 క్వింటాళ్లకుపైగా దిగుబడి వస్తుంది. రైతుల కష్టానికి తగిన ఫలితాన్ని మొక్కజొన్న పంట ఇస్తుంది. అధికారులు సూచనలు పాటిస్తూ మందుకు సాగుతున్నాం.


పి.కృష్ణారావు, రైతు, పుల్లలచెరువు

రైతులకు పలు సలహాలిస్తున్నాం:

రైతులకు పంట సాగుకు కావాల్సిన సలహాలు ఇస్తున్నాం. రబీలో ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం మంచిది. రైతులకు అవసరమైన అవగాహన కూడా కల్పిస్తున్నాం. మొక్కజొన్న పంట సాగుకు ఖర్చు కూడా తక్కువే. చీడపీడల సమస్య కూడా తక్కువగా ఉంటుంది. పంటల మార్పిడితో భూసారం పెరుగుతుంది.

నిర్మలాదేవి, వ్యవసాయాధికారి, పుల్లలచెరువు

నత్తనడకన తారు రోడ్డు పనులు



కొత్తూరు గ్రామానికి వెళ్లే తారు రోడ్డు ఇలా..

పెద్దారవీడు: మండలంలో బద్వీడుచెర్లోపల్లి నుంచి కొత్తూరు గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 40 లక్షలు నూతన తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గతంలో తారు రోడ్డుపై గుంతలు ఉన్నాయి. ఈ రహదారిలో ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. కంట్రాక్టర్ ఈ రహదారిపై కంకర, డస్ట్ మిక్స్ చేయడంతో పాటు రోడ్డు మార్జిన్లకు మట్టి వేశారు. దాదాపు రెండు నెలల నుంచి రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయని స్థానికులు చెప్పారు. మిగిలిన పనులు కంట్రాక్టర్ చేయక పోవడంతో వాహనాల రాకపోకలకు కంకర రాళ్లు పైకి లేచి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడంతో కంకర రాళ్లు లేచి గుంతలు ఏర్పడుతున్నాయని వాహనదారులు తెలిపారు. దీనికి తోడు కంకరపై నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు నడిపేందుకు వాహనదారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. వాహనాలు వచ్చి వెళ్లే సమయంలో రోడ్డుపై దుమ్ము లేస్తోంది. వాహనదారులు రాపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు వెళ్తున్న వాహనం వెనకాల వెళ్తున్న వాహనదారులు దుమ్ము కళ్లు, ముక్కుల్లో చేరడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన తారు రోడ్డును పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కంట్రాక్టర్ విశ్వనాథ్‌ను ఫోన్‌లో సంప్రదించగా పనులు నిలిచింది వాస్తవమేనని, వారం రోజుల్లో తారు రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

భూసర్వేతో సమస్యలకు తెర

- ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి



రీ సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి

కురిచేడు: సమగ్ర సర్వేతో భూసమస్యలకు తెరదింపవచ్చని ఇన్‌చార్జి ఆర్డీఓ, వెలుగొండ ప్రాజెక్టు కంభం యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి తెలిపారు. మండలంలోని పేరంబొట్లపాలెంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ రిసర్వే సమగ్రంగా జరగాలని మండలానికి ఒక గ్రామాన్ని ఎంచుకుని రైతులతో కలిసి సమస్యలు లేకుండా హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూమి గుర్తింపు, కొలతలు, హద్దులు ఏర్పాటు చేసి వాటికి నంబర్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూములను గుర్తిస్తామన్నారు. ప్రజలు సహకరించి తమ భూములకు సంబంధించి సరైన ఆధారాలు చూపితే నిర్ధారణ తేలిక అవుతుందన్నారు. తాము చేయగలిగింది సక్రమంగా చేయటం, చేయలేదని కారణం చెప్పటం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించేవి, ఎప్పటికి పరిష్కరించలేనివి, కోర్టుల్లో, వివాదాల్లో ఉన్నవి, ఇతర శాఖలకు సంబంధించినవి, పరిశీలించి పరిష్కరించేవిగా విభజించి పరిష్కరిస్తున్నట్లు ఆయన వివరించారు. మండలంలో మొత్తం 252 అర్జీలు వచ్చాయని, వాటిల్లో ఇంకా 40 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ నాగరాజు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు డ్రోన్‌లతో నిఘా



దాత నాగరాజును అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

- ఎస్పీ ఏఆర్ దామోదర్

దర్శి (కురిచేడు): నేరాలను నియంత్రించే చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిఘా పెట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామానికి చెందిన కుంచాల పెద్ద నాగరాజు (కార్తికేయ కన్‌స్ట్రక్షన్స్, హైదరాబాద్) అత్యాధునిక సాంకేతికతతో కూడిన 6 డీజీఐ ఎయిర్–3 ఎస్ డ్రోన్ కెమెరాలను గురువారం అందజేశారు. జిల్లా పోలీసు శాఖకు సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో డ్రోన్ కెమెరాలు అందజేయడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసు శాఖ తరఫున నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ డ్రోన్ కెమెరాను ముండ్లమూరు పోలీసుస్టేషనుకు ఎస్పీ దామోదర్ అందజేశారు. డ్రోన్ టెక్నాలజీని వినియోగించి నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్‌టీజింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ఏరియాలు, అసాంఘిక కార్యకలాలపాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు, నిశిత ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలపై డ్రోన్ పంపి నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. వివిధ వీఐపీల బందోబస్తులో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్ వినియోగంపై పోలీసులకు శిక్షణ తరగతులు ఇస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ రామారావు, ముండ్లమూరు ఎస్సై నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో పూజలు



ప్రత్యేక అలంకారంలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కూరగాయల దాత ఏర్వ తిరుమలకొండారెడ్డి, దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే కాలినడక శివ స్వాములు, భక్తుల కోసం అన్నదానం చేశారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం



ఉభయ దేవేరులతో వేణుగోపాలస్వామి

తర్లుపాడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవదేవేరులను ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంపై ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రోచ్చరణ మధ్య స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తర్లుపాడుతోపాటు నాయుడుపల్లి, మీర్జపేట, చెన్నారెడ్డిపల్లి, తుమ్మలచెరువు, కేతగుడిపి తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయ భాస్కర్ ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, సత్యసాయి భజన మండలి కన్వీనర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టురోగులకు సాయం



రోగులకు పౌష్టికాహారం అందించేందుకు సిద్ధంగా ఉన్న అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

దర్శి (కురిచేడు): కుష్టురోగులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారం, దుప్పట్లు, మందులు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మల్లారెడ్డి హాస్పటల్ అధినేత డాక్టర్ మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేష్, సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్ చేతుల మీదుగా రోగులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మానవత సంస్థ ప్రతినిధులను, సంస్థకు సహకరిస్తున్న దాతలను అభినందించారు. సంస్థకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని ప్రకటించారు. మానవత సంస్థ చేస్తున్న కార్యక్రమాలను డాక్టర్ మల్లారెడ్డి, కమిషనర్ మహేష్ అభినందించారు. సంస్థ మెడికల్ విభాగం డైరెక్టర్ ఎన్‌వీ సుబ్బారెడ్డి, సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాస రెడ్డి, అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి అడపాల గణేష్, వివేకానంద స్కూల్ డైరెక్టర్ రామాంజనేయులు, రిటైర్డ్ టీచర్ ఎస్ఎన్‌సీహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన రెడ్డి సంఘ అధ్యక్షుడు



వైఎస్ జగన్‌తో వెంకటేశ్వరరెడ్డి

ముండ్లమూరు (దర్శి): రెడ్డి సంఘ జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో రెడ్ల పరిస్థితులు, వ్యవసాయ పరిస్థితుల గురించి ఆయనకు వివరించారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి



ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొత్తగా నాయకత్వం వహిస్తున్న వారంతా కార్యకర్తలను కలుపుకొని ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై స్పందించాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇటీవల పదవులు పొందిన నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ కాలంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల పేద ప్రజలను ఆదుకున్నారని, నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పని చేస్తున్న తామందరం కలిసి ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అధికారం కోసం కూటమి నాయకులు అనేక తప్పుడు వాగ్దానాలు చేశారని, ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు దాటినా ఆ వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు కావడం లేదని, ఈ విషయాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లి కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఎల్లవేళలా కూటమి నాయకుల ఆటలు చెల్లవని, వారు చేస్తున్న అక్రమాలు, అవినీతి, ఘోరాలు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలు పడుతున్న బాధలను గుర్తించిన జగనన్న అలుపెరగని పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఆయన ఆశీస్సులతో తామందరం కలిసి కట్టుగా ఉద్యమాలకు సిద్ధం అవుదామని ఆయన పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జనరల్ సెక్రటరీ కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, యాక్టివిటీ సెక్రటరీ సింగా ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.జానకి రఘు, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, టి.సత్తిరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, వై.రోషిరెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు పంటల సాగుపై శిక్షణ



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కురిచేడు: ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలపై రైతులకు మండలంలోని బోధనంపాడులో వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం శిక్షణ ఇచ్చారు. రాబోయే ఖరీఫ్ కాలంలో సాగు చేసుకోబోయే పంటల గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు ఆధ్వర్యంలో దర్శి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ పి.సంధార్యాణి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం రైతులు కంది, పప్పుశనగ, మిరప, మొక్కజొన్న పంటలు సాగు చేశారని, కంది, పప్పుశనగ పంటలు ప్రస్తుతం కోత దశలో ఉన్నాయని, మిరప, మొక్కజొన్న పంటలు ప్రస్తుతం సాగులో ఉన్నాయని తెలిపారు. కంది పంటలో రైతులు ఎల్ఆర్‌జీ 52 రకాన్ని సాగు చేశారని, ఈ రకం అనుకూల వాతావరణ పరిస్థితిలో మంచి దిగుబడులు ఇస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులతో రైతులు నాణ్యమైన ఉత్పత్తులు పొందలేకపోతున్నారని తెలిపారు. అధిక వర్షాలు, అధిక మంచు, అధిక పురుగులు, తెగుళ్లతో కందిలో దిగుబడులు ఆశాజనకంగా ఉండటం లేదన్నారు. రాబోయే ఖరీఫ్ కాలంలో రైతులు వాతావరణాన్ని అనుసరించి చీడపీడలు, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం చేపట్టాలని సూచించారు. కందిలో, పప్పుశనగ పంటలో దిగుబడులతో పాటు పురుగులు, తెగుళ్లను, చీడపీడలను తట్టుకునే అధునాతన వంగడాలను వ్యవసాయ పరిశోధనా స్థానాల సలహా మేరకు రైతులు వాడుకోవాలని సూచించారు. రైతులు కంది, పప్పు శనగ పంటలను నిల్వ ఉంచే సమయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు మందుస్తుగానే కంది, మిరప పంటల్లో వేపనూనె, వేప సంబంధ కషాయాలను పిచికారీ చేసుకుంటే పురుగుల తీవ్రతను తగ్గించుకోవచ్చని సస్యరక్షణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాదరావు తెలిపారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఎల్ఆర్‌జీ52, ఎల్ఆర్‌జీ 105 రకం కంది వంగడాలు వేసుకోవాలని సూచించారు. అనంతరం పొట్లపాడులో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంట పొలాలను సందర్శించి కత్తెర పురుగుకు సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.